సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం : 29 : మార్చి : 2025



ఆ నెలవంక కోసం ఆకాశం వంక..!

రంజాన్ మాసమంతా ముస్లింలు దేవచింతనతో గడిపారు. చివరి ఘడియలు ఆసన్నం కావడంతో ఆదివారం ఆ నెలవంక కోసం ఆకాశం వంక ఎదురు చూడనున్నారు. -IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని॥ (సా॥)	సహర్ ఆది॥ (ఉ॥)
రాయచోటి	6.31	4.52
రాజంపేట	6.29	5.00
పీలేరు	6.31	4.52
మదనపల్లె	6.33	4.55

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 120 మెట్రిక్ టన్నులు



పరుగులు.. పడిగాపులు



నా పేరు చెంచుగార్ల రమణ, ఒంటిమిట్టలోని ఎస్సీ కాలనీ నివాసిని. కువైట్‌లో ఉంటున్నాను. ప్రస్తుతం రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుకు ఈకేవైసీ చేయించాలని నిబంధనల పెట్టింది. ఈకేవైసీ అయితేనే వచ్చేనెల బియ్యం ఇస్తారని, లేకుంటే ఇవ్వరని అధికారులు చెబుతున్నారు. దీంతో బతుకుదెరువు కోసం ఎక్కడో పనులు చేసుకుంటున్న తాము ఈకేవైసీ కోసం సొంతూర్లకు రావాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాలి. తమ లాంటి వారిని దృష్టిలో ఉంచుకొని ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించాలి.



రేషన్ డీలర్ వద్ద ఈకేవైసీ కోసం వేచి ఉన్న కార్డుదారులు

- ఈకేవైసీ నమోదుకు 31 ఆఖరి తేదీ
- రేషన్‌కార్డుదారుల ఆందోళన
- నత్తనతడకన నమోదు ప్రక్రియ
- ప్రజలకు తప్పని ఇక్కట్లు







రాయచోటి: జిల్లాలో రేషన్‌కార్డుల ఈకేవైసీ ప్రక్రియ కొనసాగుతోంది. గడువు సమీపిస్తుండడంతో రేషన్‌కార్డుదారులు పరుగులు పెడుతున్నారు. నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతుండటంతో పడిగాపులు కాయాల్సి వస్తోంది. మరోవైపు తీవ్రమైన ఎండలో బారులు తీరుతున్న దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. గడువులోగా చేసుకోకపోతే వచ్చే నెల బియ్యం అందవన్న భయంతో గడువు పొడిగించాలని కార్డుదారులు కోరుతున్నారు. ఈకేవైసీ నమోదుకు ప్రజల ఇక్కట్లు అన్నీ ఇన్నీ కాదు.

- రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ నమోదు, అప్‌డేట్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. మార్చి నెలాఖరులోగా ఈకేవైసీ చేసుకోకపోతే వచ్చే నెల నుంచి రేషన్ ఇవ్వరని, అందువల్ల త్వరగా చేయించుకోవాలని సూచించింది. గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం (జీఎస్‌డబ్ల్యూఎస్) మొబైల్ యాప్, ఎఫ్‌పీ షాపుల్లో ఈ–పోస్‌పరికరాల ద్వారా ఈకేవైసీ అప్‌డేట్ చేసుకునే సదుపాయం కల్పించామని చెబుతున్న ఆ మేరకు వేగం పుంజుకోలేదు.
- క్షేత్రస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈకేవైసీ జరగడం లేదు. అక్కడికి వెళ్లిన కార్డుదారులను రేషన్ డీలర్లు చేస్తారని వెనక్కి పంపుతున్నారు. దీంతో ప్రజలు ఎక్కడికి, ఇక్కడికి తిరగలేకపోతున్నారు. తీరా రేషన్ దుకాణాల వద్దకు వెళ్తే క్యూలైన్లు దర్శనమిస్తున్నాయి. తీవ్రమైన ఎండలో ప్రజలు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కాదు. మార్చి నుంచి వడగాల్పుల ప్రభావం ఉంటుందని విపత్తు నిర్వహణ సంస్థ(ఏపీఎస్‌డీఎంఏ) తెలిపింది. ప్రజలు బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తోంది.అయినా వాతావరణ శాఖల హెచ్చరికలను ఖాతరు చేయడం లేదు. మండుటెండలో గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉంటున్నారు. అక్కడ కనీసం తాగునీరు కూడా అందించేనాథుడే లేడు. నీడ కోసం కనీసం టెంట్ కూడా వేయలేదు. గంటల తరబడి వృద్ధులు, చిన్నారులు క్యూలైన్లలో ఎండలో పడిగాపులు కాస్తున్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈకేవైసీ నమోదైందో లేదో ముందుగా తెలియడం లేదని, ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.
- ఇంకా మూడు రోజులే ఉండటంతో పూర్తి స్థాయిలో ఈకేవైసీ పూర్తి చేయడం సాధ్యం కాదు. కనుక నమోదు ప్రక్రియ గడువును పొడిగించాలని కోరుతున్నారు. ఈ మేరకు సీపీఎం, సీపీఐ పార్టీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం కేవలం పది రోజుల్లో ఈకేవైసీ పూర్తి చేయాలని ప్రకటిస్తే ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాలు రెండు మూడు నెలల ముందు నుంచి చేస్తే, ప్రజలకు, సిబ్బందికి ఎటువంటి సమస్యలు రావని అంటున్నారు. ప్రజలు మండుటెండలో పడిగాపులు కాయడం, మరోవైపు ఈకేవైసీ నమోదు చేసే సిబ్బందికి ఒత్తిడి పెరగడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొంటున్నారు.

గడువు పొడిగించాలి



రైల్వేకోడూరులో చిన్న వ్యాపారం చేసుకొంటూ కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేసుకొంటున్నారు. నా కుటుంబానికి రేషన్ సరుకులు అవసరం. కానీ ఇప్పుడు ప్రభుత్వం ఈకేవైసీ చేయించుకోవాలని చెబుతోంది. కొద్దిరోజులుగా మేం ఇంట్లో లేము. మాపిల్లలు బయట చదువుతున్నారు. సమయం ఇవ్వకుండా ఈకేవైసీ లేనివారికి ఏప్రిల్ నెలలో రేషన్ ఇవ్వడంలేదని చెప్పడం పేదలను ఇబ్బంది పెట్టడమే, ప్రభుత్వ నిర్ణయం సరికాదు. గడువు పొడిగించాలి. **-కాకర్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాఘవరాజుపురం**

సెలవు పెట్టుకుని రావాల్సి వస్తోంది



నేను హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్నాను. ఈకేవైసీ చేయించుకోవాలంటే సెలవు పెట్టుకుని రావాలి. సెలవు ఇవ్వకుంటే రావడానికి వీలు పడదు. ఈకేవైసీ చేయించుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని చెబుతున్నారు. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి. కుటుంబంలో ఒక కార్డుకు ఒకరికి మాత్రమే ఈకేవైసీ నమోదు చేసుకునే వెసులుబాటు కల్పిస్తే బాగుంటుంది. **- బండి తిరుపాల్, సుండుపల్లె టౌన్**

గడువు పెంచే అవకాశం

ఈకేవైసీ నమోదుకు గడువును పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి రఘురాం తెలిపారు. జిల్లాలో 1,51,870 కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. శనివారం లేదా ఆదివారం కేంద్ర ప్రభుత్వం నుంచి గడువు పెంచే ఆదేశాలు వస్తాయన్న నమ్మకం ఉందన్నారు. ఏప్రిల్ 30 వరకు గడువు పెరిగే అవకాశముందన్నారు.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు టైలరింగ్, బ్యూటీ పార్లర్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఎం.ఆరిఫ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్ల మధ్య వయసు గల మహిళలు ఈ శిక్షణకు అర్హులని ఆయన పేర్కొన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. వివరాలకు 94409 05478. 9985606866 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియామకాలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన దిగువ పేర్కొన్న వారిని రాష్ట అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. స్టేట్ బీసీసెల్ జాయింట్ సెక్రటరీగా అర్ల సుబ్బయ్య, స్టేట్ వలంటీర్స్ విభాగం ప్రధాన కార్యదర్శిగా వై. గణేష్ కుమార్‌రెడ్డి, స్టేట్ బూత్ కమిటీస్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా కె. అమర్‌నాథ్‌రెడ్డి, స్టేట్ సోషల్ మీడియా విభాగం జాయింట్ సెక్రటరీలుగా ఎం. బాలిరెడ్డి, ఎస్. వెంకటరెడ్డి, స్టేట్ వీవర్స్ విభాగం జాయింట్ సెక్రటరీగా జి. శివశంకరయ్యలను నియమించారు.

ఏప్రిల్ 1న పదోతరగతి సోషియల్ పరీక్ష

రాయచోటి టౌన్: పదో తరగతి సాంఘిక శాస్త్రం (సోషియల్) పరీక్షను ప్రభుత్వ ఆదేశాలను సారం ఏప్రిల్ 1వ తేదీ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం శుక్రవారం తెలిపారు. ఈ నెల 31న రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిందని తెలిపారు. కావున ఆరోజున జరగాల్సిన సాంఘిక శాస్త్రం పరీక్షను 1వ తేదీకి మార్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్ష తేదీ మార్పును విద్యార్థులు, తల్లితండ్రులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గమనించాలని కోరారు. ఈ విషయాన్ని డీఎల్‌వో/ ఆర్‌జెడీఎస్‌ఈ/ డీఈవో/ ఏసీజీఈలకు తెలియచేయాలని సూచించారు.

నిత్యపూజస్వామి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

సిద్దవటం: మండలంలోని వంతాటిపల్లె గ్రామ పంచాయతీ లంకమల అడవీ ప్రాంతంలో వెలసిన శ్రీనిత్యపూజ స్వామి హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. రూ. 72,470 వచ్చిందని ఆలయ ఈఓ శ్రీధర్ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27 నుంచి మార్చి 28వరకు భక్తులు స్వామి వారి హుండీలో వేసిన కానుకలను శుక్రవారం దేవదాయశాఖ రాజంపేట ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, సిద్దవటం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వారు, పోలీసులు, భక్తుల సమక్షంలో లెక్కించినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ వెంకట సురేంద్రబాబు, మెసెంజర్ సతీష్, పోలీసు రమణయ్య, ఆలయ ఉద్యోగి చంద్ర, అర్చకులు సుబ్రమణ్యం శర్మ, వంతాటిపల్లె వాసి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి జగదాంబసెంటర్: జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు దార్శనిక కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి అర్హులైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కలెక్టర్ అధ్యక్షతన ఐదు మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

- జిల్లా దార్శనిక కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం కోసం ఐదుగురుని ఎంపిక చేస్తారు.

అర్హత: మహిళా పోలీస్ (లేదా) సర్వే అసిస్టెంట్ (లేదా) వీఆర్‌ఓ/ వార్డు రెవెన్యూ సెక్రటరీ (లేదా) వార్డ్ ప్లానింగ్ అండ్‌రెగ్యులేషన్ సెక్రటరీ **విద్యార్హత:** స్టాటిస్టిక్స్/మ్యాథమేటిక్స్/ఎకనామిక్స్/కామర్స్/ కంప్యూటర్ సైన్స్/ ఎంబీఏ/ ఇంజనీరింగ్ ఏదైనా ఒక దానిలో బ్యాచిలర్ డిగ్రీ ఉండి, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ ఉండాలి.

- నియోజకవర్గ దార్శనిక కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం కోసం ఒక్కో నియోజకవర్గం కొరకు ఐదుగురిని ఎంపిక చేస్తారు.

అర్హత: మహిళా పోలీస్ (లేదా) సర్వే అసిస్టెంట్ (లేదా) విఆర్‌ఓ/ వార్డు రెవెన్యూ సెక్రటరీ (లేదా) వార్డ్ ప్లానింగ్ అండ్‌రెగ్యులేషన్ సెక్రటరీ **విద్యార్హత:** స్టాటిస్టిక్స్/ మ్యాథమేటిక్స్/ ఎకనామిక్స్/ కామర్స్/ కంప్యూటర్‌సైన్స్/ ఎంబీఏ/ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్/ పొలిటికల్ సైన్స్/ అగ్రికల్చర్ అండ్ అల్లాయిడ్ సబ్జెక్ట్స్/ ఇంజనీరింగ్ ఏదైనా ఒక దానిలో బ్యాచిలర్ డిగ్రీ ఉండి బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ ఉన్నవారు అర్హులు. ఆసక్తి గల వారు దరఖాస్తులను కలెక్టరేట్‌లోని ముఖ్య ప్రణాళిక అధికారి వారి కార్యాలయం నుంచి, ఎంపీడీఓ కార్యాలయాల నుంచి తీసుకోవాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వారి కార్యాలయం, కలెక్టరేట్, రాయచోటిలో సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

వేలమా.. కొనసాగింపా?




టోల్ వసూలు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

- హార్సిలీహిల్స్ టోల్‌గేట్ వసూళ్లపై సందిగ్ధం
- ఫిబ్రవరి 5 నుంచి రెవెన్యూ సిబ్బందితో వసూళ్లు

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు వచ్చే సందర్శకుల నుంచి వసూలు చేసే టోల్ రుసుంపై వేలం పాటలు నిర్వహించి ప్రయివేటుకు అప్పగిస్తారా లేక రెవెన్యూ సిబ్బందితో వసూళ్లు కొనసాగిస్తారా అన్నది స్పష్టం కావడం లేదు. గతేడాది సెప్టెంబర్ 30న మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వేలంపాటలు నిర్వహించగా.. మదనపల్లెకు చెందిన వ్యక్తి రూ.45.20 లక్షలతో రికార్డు స్థాయిలో లీజు దక్కించుకున్నాడు. అక్టోబర్ 18 నుంచి ఏడాది పాటు టోల్ వసూలుకు అప్పగించారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి 4 వరకు వేలంలో పాడిన సొమ్మును చెల్లించకపోవడంతో ఐదో తేదీన టెండర్ రద్దు చేసి.. 5వ తేదీ నుంచి రెవెన్యూ సిబ్బందితో వసూళ్లు చేయిస్తున్నారు. సాధారణంగా ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న సమయంలో లీజులు, గుత్తలపై మార్చిలో వేలం పాటలను నిర్వహించి ప్రయివేటుకు అప్పగిస్తారు. అయితే హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ చైర్మన్ అయిన మదనపల్లె సబ్‌కలెక్టర్ ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదు. దీనితో వేలంపాటలు నిర్వహిస్తే పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్న పాటదారులు ఎదురు చూస్తున్నారు. గత వేలంలో అత్యధికంగా రూ.45.20 లక్షలకు పాడారు. ఈ పాటను దృష్టిలో పెట్టుకుని అధికారులు తదుపరి వేలంపాటపై నిర్ణయం తీసుకుంటారా.. లేక గత పాటలో నిర్ణయించిన ధర పాటను మొదలు పెడ్తారా అన్నది తేలాలి. కాగా ఫిబ్రవరి 5 నుంచి బి.కొత్తకోట రెవెన్యూ సిబ్బంది టోల్ వసూళ్లు చేస్తున్నారు. రోజుకు మూడు షిఫ్టుల్లో వీఆర్‌ఏలను నియమించి చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తింపజేస్తున్నారు. వాహనాలకు టోకెన్లు ఇస్తూ ఎంట్రీ ఫీజును వసూలు చేస్తున్నారు. ఇలా వసూలు చేస్తుండటంపై ఎలాంటి ఆరోపణలు, విమర్శలు లేకపోవడంతో.. ఇదే పద్ధతితో కొనసాగిస్తారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఐదేళ్ల క్రితం వరకు రెవెన్యూ సిబ్బంది ద్వారానే టోల్ వసూలు చేయించేవాళ్లు. తర్వాత ఇద్దరు వీఆర్‌ఏలు అవినీతికి పాల్పడటంతో వారిని సస్పెండ్ చేశారు. దీనితో సబ్‌కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి. దీనిపై తహసీల్దార్ అజారుద్దీన్ మాట్లాడుతూ వేలం పాటలపై తమకు ఎలాంటి సమాచారం లేదని శుక్రవారం చెప్పారు.

1న ఒంటిమిట్టలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయం

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరగనుంది. ఏప్రిల్ 5 నుంచి 15 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో.. ముందుగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి అర్చన చేసి, ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో గర్భాలయం, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ గరుత్మంతుని సన్నిధి, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు. నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం భక్తులను ఉదయం 11.30 గంటల నుంచి సర్వదర్శనానికి అనుమతిస్తారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, తదితరులు

రాయచోటి టౌన్: పవిత్రమైన రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని మండీల ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ముస్లింలు అందరూ కలసి మెలసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో 30 రోజులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు నిర్వహించడం, నమాజ్ చేయడం చాలా గొప్ప విషయమన్నారు. ముస్లింలకు మంత్రి మండిపల్లి, కలెక్టర్ శ్రీధర్ శుభాంక్షలు తెలియచేశారు.

ఇంటి దొంగపై సస్పెన్షన్ వేటు

- కానిస్టేబుల్ రామాంజులు సస్పెన్షన్.
- ఐదు కేసుల్లో నిందితుడు



కానిస్టేబుల్ రామాంజులు

టాస్క్ ఫోర్స్: అంతర్ జిల్లాల గ్యాంబ్లర్లతో కలిసి పేకాటల నిర్వహణతో అన్నమయ్య జిల్లా పోలీసులకే సవాలుగా నిలిచిన కానిస్టేబుల్ ఇడగొట్టు రామాంజులును సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి సస్పెన్షన్ ఉత్తర్వులను విడుదల చేసినట్లు పోలీసుల సమాచారం. ఉత్తర్వులను రాయచోటి పోలీసులు అందజేసినట్లు తెలిసింది. రామాంజులుపై 2017లో చిన్నమండెం పోలీసు స్టేషన్లో రెండు కేసులు, 2018లో రామాపురం పోలీసు స్టేషన్లో హత్యాయత్నం కేసుతో పాటు మరో కేసు, రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్లో తాజాగా ఇంకో కేసు కలిపి 5 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అధికార పార్టీని అండగా చేసుకొని పేకాట, కోడి పందేలు ఆడిస్తూ లక్షల రూపాయలు ఆదాయాన్ని గడించినట్లు పోలీసు విచారణలో బయటపడింది.

అధికార పార్టీ అండదండలతో..

అంతర్ జిల్లాల గ్యాంబ్లర్లతో కలిసి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించినట్లు సమాచారం. వివిధ జిల్లాల నుంచి వచ్చిన పేకాట రాయుళ్లకు జిల్లా కేంద్రం, పరిసర ప్రాంతాలు పేకాటకు వేదికలను చేసినట్లు సమాచారం. మొబైల్ పేకాట, స్థానికంగా ఉన్న తోటలు, గుట్టలు వేదికగా ప్రతిరోజు కోట్ల రూపాయల చేతులు మారే జూద శాలలను నడిపినట్లు విచారణలో తేలింది. జిల్లా ఎస్పీ, పోలీసులను కాదని తన ప్రత్యేక సిబ్బంది ద్వారా దాడులను నిర్వహించడంతో అసలు విషయాలు బయటకు వచ్చాయి.గ్యాంబ్లర్లు, నిర్వాహకుల నుంచి స్థానిక అధికార పార్టీ ద్వితీశ్రేణి నాయకులు, పోలీసు అధికారులకు అందజేసిన మామూళ్ల వ్యవహారం విచారణలో తేలినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో పోలీసులు కొంతమంది గ్యాంబ్లర్లతో చేతులు కలిపి లక్షల, కోట్ల రూపాయల సంపాదనలతో జేబులు నింపుకుంటున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. స్థానిక పోలీసు అధికారులకు వారధులుగా మారి రోజుకు రెండు, మూడు కేంద్రాల్లో అంతర్ జిల్లా పేకాట స్థావరాలను నిర్వహిస్తుండటంపై పోలీస్ శాఖ ఉన్నతాధికారులకే సవాల్‌గా మారాడు. ఒక్కో ఆట నిర్వహణకు స్థానిక పోలీసు అధికారులకు లక్ష రూపాయలు ప్రతి రోజు ముడుపుల రూపంలో ముడుతున్నట్లు ప్రచారం ఉంది. ఇలా రోజుకు రెండు, మూడు క్యాంపులు నిర్వహించి..అంతే మొత్తంలో గ్యాంబ్లర్లు అశోక్ రెడ్డి, నర్సరీ రమణ, మరికొందరి నుంచి ఆ కానిస్టేబుల్ స్థానిక పోలీసు అధికారులకు అందచేస్తున్నట్లు తెలియవచ్చింది. గ్యాంబ్లర్ల సహాయంతో పేకాట నిర్వహణకు సహకరిస్తున్న పోలీసు సిబ్బంది, ఆ పై స్థాయి డబుల్, త్రిబుల్ స్టార్లు ఉన్న పోలీసు అధికారులకు.. పోలీసు బాస్ జిల్లా కేంద్రంలోనే ఉన్నారన్న భయం, బెరుకు ఏమాత్రం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పేకాట, కోడి పందెం, ఇతర అసాంఘిక కార్యకలాపాల పట్ల స్థానిక పోలీసు అధికారులకు సమాచారం అందినా రాజకీయ ఒత్తిళ్లతో కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ పరిస్థితి జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నా రాయచోటి, మదనపల్లెలో అధికంగా కనిపిస్తోంది.

ఎస్పీ ఆదేశాలు బేఖాతర్

జిల్లాలో కొంతమంది పోలీసులు శాంతి భద్ర తలను గాలికి వదిలి సెటిల్మెంట్లు, అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకు ప్రతిపక్ష పార్టీ నేతలపై కేసులు పెట్టడం, వేధింపులకు గురి చేస్తూ వారి సేవలో తరిస్తున్నట్లు సమాచారం. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలని జిల్లా యంత్రాంగానికి ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పదేపదే ఆదేశిస్తున్నా స్థానిక అధికారుల్లో ఏమాత్రం చలనం లేకపోవడం గమనార్హం. దీంతో ఎస్పీ నేరుగా రంగంలోకి దిగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఎస్పీకి అనుబంధ శాఖలు, వేగుల నుంచి అందుతున్న సమాచారం మేరకు నేరుగా స్పెషల్ పార్టీ పోలీసులతో పేకాట స్థావరాలపై దాడులు చేస్తూ తనదైన శైలిలో చర్యలు చేపట్టారు. ఇంటి దొంగగా పేరొందిన కానిస్టేబుల్ రామాంజులుపై గతంలో క్రిమినల్ కేసులు ఉన్నప్పటికీ, అదనంగా రౌడీ షీటర్ కేసు ఎందుకు ఓపెన్ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణ వ్యక్తులపై మూడు..ఆ పై కేసులు నమోదైతే వెంటనే వారిపై రౌడీషీట్ ఓపెన్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టే పోలీసు యంత్రాంగం అదే శాఖలో పనిచేస్తూ ఐదు కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తిపై సస్పెన్షన్ మినహా తదుపరి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్న ఆరోపణలు కూడా జిల్లా వ్యాప్తంగా వినిపిస్తున్నాయి. ఏదేమైనా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అసాంఘిక శక్తుల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తుండడంతో ఇటు జూద శాలల నిర్వాహకులకు, అటు పోలీస్ శాఖలోని ఇంటి దొంగలలో భయం పట్టుకుందునడంలో సందేహం లేదు.

బాబోయ్ ఎండలు



- అధిక ఉష్ణోగ్రతలతో జనం బెంబేలు
- రానున్న రోజుల్లో పెరుగుతున్న తీవ్రత



మండుతున్న ఎండలతో బోసిపోతున్న హార్సిలీహిల్స్ గాలిబండ



జనాలు లేక బోసిపోయిన రాయచోటిలోని ప్రధాన రహదారి

రాయచోటి: జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపం చూపుతున్నాడు. సాయంత్రం 4 గంటల అధికంగా ఎండ వేడి, ఉక్కపోత ఉండడంతో జిల్లా వాసులు విలవిల్లాడుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. మధ్యాహ్నం సమయంలో ప్రధాన రహదారులు, కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండవేడిమికి వృత్తిదారులు తమ పనులు చేయలేకపోతున్నారు. ఉపాధి వేతనదారులు, భవన నిర్మాణ కార్మికులు, శ్రామికులు, ఫుట్‌పాత్ వ్యాపారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు అల్లాడిపోతున్నారు. ప్రయాణికులు, వాహనదారులు కూడా రాకపోకలు సాగించలేకపోతున్నారు. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చేవారు సైతం ఉదయం 10 నుంచి 11 గంటల్లోపు పనులను చూసుకొని ఇళ్లబాట పడుతున్నారు. జిల్లాలో రైల్వే కోడూరులో అత్యధికంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా మదనపల్లె 34 డిగ్రీలు నమోదైంది. రాజంపేటలో 41, రాయచోటిలో 39, పీలేరులో 38, తంబళ్లపల్లిలో 37 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని, వేడిగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ముఖ్యంగా జిల్లా పరిధిలోని కోడూరు, రాయచోటి, రాజంపేట, పీలేరు ప్రాంతాల్లో ఠారెత్తిస్తాయని తెలుస్తోంది.

హార్సిలీహిల్స్ @ 31 డిగ్రీలు

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఎండ మండుతోంది. శుక్రవారం 31 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. సముద్రమట్టానికి 4,141 అడుగుల ఎత్తులోని హార్సిలీహిల్స్‌పై మండువేసవిలోనూ 32 డిగ్రీలకు మించదు. అలాంటిది మార్చి 28న ఏకంగా 31 డిగ్రీలు నమోదు కావడం, ఏప్రిల్, మే మాసాల్లో ఉష్ణోగ్రతలు ఏ స్థాయిలో ఉంటాయోనన్న ఆసక్తి నెలకొంది. ఉష్ణోగ్రతలు ఈ స్థాయిలో నమోదైతే ఆంధ్రాఊటీ గా పేరుగాంచిన హార్సిలీహిల్స్ కూడా సాధారణ ప్రాంతంగానే మారిపోతోందన్న ఆందోళన పర్యాటకుల్లో వ్యక్తం అవుతోంది. గత పదేళ్లుగా హార్సిలీహిల్స్‌పై పర్యావరణం ఊహించని విధంగా మారిపోతోంది. దీనికి ప్రధాన కారణం చుట్టూ అడవి వున్న కొండపై కాంక్రీటు నిర్మాణాలు అధికం కావడం, పారిశుద్యం, వ్యర్థాల నిర్వహణలేక రోడ్లపైనే పారబోస్తుండటం లాంటి ఎన్నో కారణాలు ఉన్నాయి. దీనిపై పర్యావరణ వేత్తలు స్పందించి హార్సిలీహిల్స్ వాతావరణం కాపాడేందుకు కృషి చేయాలని ప్రకృతి ప్రేమికుల కోరుతున్నారు.

క్లుప్తంగా

చెట్ల నరికివేతపై విచారణ

నందలూరు : మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని భారత్ గ్యాస్ కార్యాలయం నుండి నీలిపల్లెకు వెళ్లే దారిలో ఆర్అండ్బి పరిధిలో ఉన్న చెట్లను నరికించడంపై స్థానిక విద్యుత్ ఏఈ బాలసుబ్రమణ్యంను రాజంపేట అటవీశాఖ అధికారులు శుక్రవారం విచారించారు. విద్యుత్ లైన్ ఏర్పాటుకు అడ్డంగా ఉన్నాయని, ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లను విద్యుత్ సిబ్బంది తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు ఏఈని విచారించినట్లు సమాచారం. అదే విధంగా చెట్లను నరికివేయడంపై రోడ్లు భవనాలశాఖ ఏఈ కుమార్ బాబు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్థానిక పోలీసులు విద్యుత్ ఏఈని విచారణకు రమ్మన్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి

గాలివీడు : మండలపరిధి గుండ్ల చెరువు కస్పాకు చెందిన దారాల మౌలాలి (62) అనే వృద్ధుడు కోనంపేట–గాలివీడు ప్రధాన రహదారి పేరంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం మౌలాలి ద్విచక్ర వాహనంపై గుండ్లచెరువు నుండి గాలివీడు వస్తుండగా మార్గమధ్యంలో పేరంపల్లి వద్దకు రాగానే అదుపుతప్పి ఒక్కసారిగా కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రవేటు వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


రామాంజినేయులు (ఫైల్)

రాజంపేట : రాజంపేట రైల్వేస్టేషన్లో పుల్లంపేట మండలం బావికాడపల్లెకు చెందిన వీ.రామాంజినేయులు (29) అనే యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. మృతుడు పట్టణంలో ఓ ఫోటో స్టూడియో నిర్వహిస్తున్నారు. అప్పులబాధతో ఆత్మహత్యకు పాల్పడినట్లుగా స్థానికులు చెబుతున్నారు. రామాంజినేయులుకు ఏడాది కిందట పెళ్లి జరిగిందని సంబంధీకులు చెపుతున్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

బి.కొత్తకోట : అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఓ వ్యక్తి శుక్రవారం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బడికాయలపల్లెలో జరిగింది. ఏఎస్ఐ భాస్కర్ నాయక్ కథనం మేరకు వివరాలు.. బడికాయలపల్లెకు చెందిన టి.కృష్ణప్ప (64) కొంతకాలంగా పలు అనారోగ్య సమస్యలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నాడు. అయినప్పటికీ ఆరోగ్యం కుదుట పడకపోవడం, కడుపు నొప్పి తీవ్రం కావడంతో భరించలేకపోయాడు. దీనితో ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయటకు వచ్చిన కృష్ణప్ప జూటూరు గుట్ట వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గొర్రెల కాపరులు దీన్ని గుర్తించి మృతుని కుమారునికి సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్నాడు. తర్వాత పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

సంబేపల్లె : వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సంబేపల్లె పోలీసులు శక్రవారం తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లెకు చెందిన రమేశ్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన 4 వ తరగతి చదువుతున్న విద్యార్థిపై గురువారం రాత్రి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు విద్యార్థి తల్లిదండ్రులు శుక్రవారం సంబేపల్లె పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాలుడిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి దండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సంబేపల్లె పోలీసులు తెలిపారు.



ఆ నెలవంక కోసం ఆకాశం వంక..!

మదనపల్లె సిటీ : రోజంతా కఠిన ఉపవాసం... దైవంపైనే మనసు లగ్నం... పవిత్ర ఖురాన్ పఠనం, శ్రవణం.. తోటివారిపై ప్రేమ, సోదరభావం.. పేదలపై దయ, కరుణ, దాన, ధర్మాలు.. ఇలా శుభాల వసంతం రంజాన్ మాసమంతా ముస్లింలు నియమ నిష్టలు... దైవచింతనతో గడిపారు. చివరి ఘడియలు ఆసన్నం కావడంతో ఆదివారం ఆ నెలవంక కోసం ఆకాశం వంక ఎదురు చూడనున్నారు. నెల రోజుల పాటు సహరీ, ఇఫ్తార్, తరావీహ్ ప్రార్థనల్లో లీనమైన ముస్లింలు ఆదివారం సాయంత్రం షవ్వాల్ నెలవంక కోసం ఆకాశం వంక వేయికళ్లతో ఎదురు చూస్తారు. ఇఫ్తార్ సమయంలో పేలే బాణాసంచా ముందు, భానుడు పశ్చిమ సంద్రంలో మునిగే సమయంలో అందరి చూపు ఆకాశం వైపే ఉంటుంది. ఆకాశంలో నీలిమేఘాల మాటు నుంచి మబ్బు తెరలు తొలగించుకుని అరసున్న ఆకారంలో కనిపించే షవ్వాల్ నెల వంక కోసం అందరూ వెతుకుతారు. నీలి మేఘాల మాటు నుంచి అరుణాచల కాంతులతో వెలిగే అర్ధ ఆకార చంద్రుడు.. కనబడగానే అందరిలో పూర్ణానందం వెల్లివిరిస్తుంది. 'ఈద్ కా చాంద్ నజర్ ఆగయా... సబ్ కో ఈద్ ముబారక్' అంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, ఈద్ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. అంబరాన్నంటే సంబరాలు చేసుకుంటారు.


జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఈద్గా, మసీదుల ముస్తాబు..

ఈద్ ప్రార్థనల కోసం జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, వాల్మీకిపురం, గుర్రంకొండ, బి.కొత్తకోట ప్రాంతాలతో పాటు ముస్లింలు గణనీయ సంఖ్యలో ఉన్న పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఈద్గాలు, మసీదులు ముస్తాబవుతున్నాయి. మరోవైపు ముస్లిం సోదరులు ఇంటిల్లిపాది కొత్తగా కొనుగోలు చేసిన దుస్తులను చూసి మురిసిపోతున్నారు. ఆడపడుచులు బిరియానీ మసాలాల తయారీలో లీనమవుతున్నారు. చిన్నారులు తమ చేతులను మెహందీతో అలంకరించుకుంటున్నారు.

నెలవంక దర్శనంతోనే నిర్ణయం

షాబాన్ నెల 30వ రోజున రంజాన్ నెలవంక దర్శనంతో ఉపవాసదీక్షను ప్రారంభించడం, 30 రోజుల అనంతరం షవ్వాల్ నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలను ముగించి ఈదుల్ ఫితర్ పండుగను జరుపుకోవడంలోనూ నెలవంక దర్శనమే కీలకం. చాలా సందర్భాల్లో రంజాన్ నెల వంక వాతావరణ ప్రభావంతో కనిపించనప్పుడు మతగురువులు ముఖ్యంగా ప్రభుత్వ సర్ఖాజీలు, హాఫీజ్సాబ్లు సమావేశమై రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాల్లోని ముఫ్తీలు, హిలాల్ కమిటీలతో సమన్వయం చేసుకుని చంద్రుని దర్శన సమాచారం తెప్పించుకుంటారు. వారి నిర్ణయంతోనే రంజాన్ పండుగను నిర్ణయిస్తారు. ఆదివారం నెలవంక దర్శనమైతే సోమవారం పండుగ జరుపుకుంటారు.

లైలతెల్ జాయెజా..

పవిత్ర రంజాన్ మాసం ముగింపు సందర్భంగా షవ్వాల్ నెలవంక దర్శనం అనంతరం ఆ రోజు రాత్రిని లైలతుల్ జాయెజా గా వ్యవహరిస్తారు. మసీదులోల ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. నెల రోజుల ఉపవాసదీక్షల ఫలితాన్ని ఈ రాత్రి ప్రార్థించేవారికి అల్లా ఇస్తారని ముస్లింలు విశ్వసిస్తారు. దీంతో మసీదుల్లో ముస్లింలు ఎక్కువ సంఖ్యలో చేరి దైవ ప్రార్థనలు చేస్తారు. ఎక్కువ సమయం దివ్యఖురాన్ పారాయణం, శ్రవణంతో గడుపుతారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

గుర్రంకొండ : భూసార పరీక్షలతో రైతులు అధిక పంట దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు భూసార పరీక్షల ఫలితాలు ఆధారంగా పంటలకు ఎరువుల వినియోగం అన్న అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తమ పొలంలో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. పంటల సాగు చేసినప్పుడు భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగిస్తే మొక్కలకు సరైన మోతాదులో పోషకాలు అందుతాయన్నారు. తద్వారా మంచి దిగుబడులు సాధించడంతో పాటు భూములు కూడా సారవంతంగా మారుతాయన్నారు. ఒక పంట సాగు చేసే సమయంలో ఎకరం పొలానికి రెండు టన్నుల పశువుల ఎరువు, నత్రజని 224 కేజీలు, భాస్వరం 10 కేజీలు, పొటాషియం 127 కేజీలు, జింక్ సల్ఫేట్ వరి పంటకు 20 కేజీలు వినియోగించుకోవాలన్నారు. బోరాన్ 5 కేజీలు ఆఖరి దుక్కిలో ముఖ్యంగా పండ్ల తోటలకు వేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్షా ఫలితాల కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ నాగరత్నమ్మ, ఏఈఓ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వ హయాంలోనే చేనేతలకు న్యాయం


మాట్లాడుతున్న వైఎస్ఆర్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్

రాయచోటి అర్బన్ : జగనన్న ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో చేనేతలకు న్యాయం జరిగిందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్ఆర్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమది బీసీల పార్టీ అని చెప్పుకుంటున్న టీడీపీ నేతలు బీసీల ఓట్లతో గద్దెనెక్కుతూ చివరకు మోసం చేస్తూ వస్తుండడం దారుణమన్నారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలో చేనేతలకు యేటా రూ.24 వేలు ఆర్థిక సహాయం అందించేదన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేనేతలకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రద్దు చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చేనేతలకు యేటా రూ.24వేల ఆర్థిక సహాయాన్ని అందించాల న్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీని ఎత్తివేసి చేనేత కళాకారులను ఆదుకోవాలంటూ కోరారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్ సీపీ బీసీ నేతలు జానం రవీంద్ర యాదవ్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో చతికిలపడిన కూటమి

రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలనలో విఫలమైందని అనడానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీల ఓటమే నిదర్శనమని రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఫ్యాన్ దూకుడుకు స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు కూటమి ప్రభుత్వం చతికిలపడిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికారులను, పోలీసులను ఉసిగొల్పి, రౌడీలతో బెదిరించినప్పటికీ వైఎస్సార్సీపీ సభ్యులు ఎక్కడా తగ్గలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 స్థానాలలో జరిగిన ఉప ఎన్నికలలో ఏకంగా 32 స్థానాలు వైఎస్సార్సీపీ కైవసం చేసుకోవడం, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఉన్న ఆదరణకు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా క్షుద్ర రాజకీయాలు చేయకుండా బుద్ధితెచ్చుకోవాలన్నారు. దొడ్డిదారిన పదవులు చేజిక్కించుకునేందుకు కూటమి నేతలు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయన్నారు. పాలనలో ఇంతటి వ్యతిరేకతను మూటకట్టుకున్న ప్రభుత్వం దేశంలో ఏదైనా ఉందంటే అది కూటమి ప్రభుత్వమేనని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఇకనైనా బుద్ధి తెచ్చుకొని సుపరిపాలన అందించాలన్నారు. పేద ప్రజలపై వివక్ష చూపిస్తూ రేషన్ కార్డులు, గృహాలు, సంక్షేమ పథకాలు ఇలా అన్ని తగ్గించుకుంటూ పోతూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని, ప్రజలు త్వరలో బుద్ధిచెబుతారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రత్నమ్మ, ఆర్వీ రమణ, హరికృష్ణారెడ్డి, సిహెచ్ రమేష్, మండల నాగేంద్ర, యానాది రెడ్డి, వెంకటరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మల్లికార్జున, కృష్ణయ్య, కరిముల్లా, సుబ్బరాయుడు, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలి


లేగ దూడల ప్రదర్శనలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, వైద్యులు

పెద్దమండ్యం : వైద్యుల సూచనలు పాటించి, పాడి రైతులు ఆర్థికాభివృద్ధిని సాధించాలని అన్నమయ్య జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి గుణశేఖర పిళ్లై అన్నారు. మండలంలోని వెలిగల్లు పశు వైద్యశాల వద్ద శుక్రవారం లేగదూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుండి పాడి రైతులు 83 లేగదూడలను ప్రదర్శనకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పాడి ఆవులు, లేగదూడల పోషణలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. లేగదూడల జాతి లక్షణాలు, శరీర బరువు, యాజమాన్య పద్ధతులను బట్టి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎంపిక చేశారు. పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీ డాక్టర్ బాలసుబ్రమణ్యం, మదనపల్లె డివిజన్ డీడీ డాక్టర్ సత్యనారాయణ, తంబళ్లపల్లె ఏడీ డాక్టర్ సుమిత్ర, డాక్టర్లు విక్రమ్రెడ్డి, ఉస్మాన్, సుజన, సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లు, పాడి రైతులు పాల్గొన్నారు.

వెదురుతోట పెంపకంతో ఆదాయం


వెదురు సాగుపై శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న మల్లికార్జున రాజు

ఓబులవారిపల్లె : వెదురుతోట పెంపకం ద్వారా మహిళలు ఆర్థికంగా ప్రయోజనం పొందవచ్చని ఏపీఎం మల్లికార్జున రాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక శ్రీశక్తి భవనంలో మండల ఎస్ఎస్జీ సభ్యులకు వెదురు పెంపకంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రాజు మాట్లాడుతూ మండలంలో వెదురుతోట పెంపకం అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. 350 మంది రైతులను గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి సాగు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వెదురు సాగుకు 30 సెంట్లు భూమి ఉండాలని, 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు చిన్నకారు రైతులు అర్హులన్నారు. బీడు భూములు, వృథా భూములు తోటల పెంపకానికి అనుకూలమని తెలిపారు. వెదురు పంటలో అంతర్ పంట సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు ఏపీఎం వసుంధర, మండల సీసీలు దామోదర్, గోవిందమ్మ, వెంకటసుబ్బమ్మ, హరిబాబు, శివయ్య పాల్గొన్నారు.

హత్యకేసులో నలుగురికి జీవిత ఖైదు


హత్య కేసులో జీవిత ఖైదు శిక్ష పడిన నిందితులను జైలుకు తరలిస్తున్న పోలీసులు

మదనపల్లె : హత్యకేసులో విచారణ అనంతరం నలుగురు నిందితులకు జీవిత ఖైదును విధిస్తూ రెండో ఏడీజే కోర్టు న్యాయమూర్తి జే.అబ్రహాం శుక్రవారం తీర్పు ఇచ్చారు. పట్టణంలోని టూటౌన్ పోలీస్స్టేషన్ పరిధిలోని చంద్రాకాలనీ దండుమారెమ్మ గుడి సమీపంలో 16.8.2014లో రాత్రి 11.45 గంటల సమయంలో స్టోర్వీధిలో నివాసం ఉన్న పూల వెంకటా చలపతి హత్యకు గురయ్యాడు. ఘటనపై అతడి భార్య పూలజ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ గంగయ్య టూటౌన్ పోలీస్స్టేషన్లో కేసు నమోదుచేశారు. హత్యకేసులో నిందితులుగా ఏ–1 ధనేశ్వర్రెడ్డి, ఏ–2 రామిశెట్టి కిషోర్, (33), ఏ–3 అమరనాథ్, ఏ–4 డి.గంగాధర్, ఏ–5 ఎస్.మల్లికార్జున, ఏ–6 మలిగి సురేంద్రరెడ్డి అలియాస్ మెస్ సూరిలను పేర్కొంటూ కేసు విచారణ చేశారు. అనంతరం నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. కేసు విచారణ దశలో ఉండగా, ప్రధాన నిందితుడైన ఏ–1 ధనేశ్వర్రెడ్డి 2021లో తంబళ్లపల్లె పోలీస్స్టేషన్ పరిధిలో హత్యకు గురయ్యాడు. అదేవిధంగా ఏ–3 అమరనాథ్ 2017లో ముదివేడు పోలీస్స్టేషన్ పరిధిలో హత్యకు గురయ్యాడు. కాగా, మిగిలిన నలుగురు నిందితులపై సెకండ్ ఏడీజే కోర్టులో వాదనలు జరిగాయి. విచారణ అనంతరం ఏ–2 రామిశెట్టి కిషోర్, ఏ–4 డి.గంగాధర్, ఏ–5 ఎస్.మల్లికార్జున, ఏ–6 మలిగి సురేంద్రరెడ్డి అలియాస్ మెస్ సూరిలకు జీవిత ఖైదు శిక్షతో పాటు ఒకొక్కరు రూ.20వేల జరిమానా చెల్లించాల్సిందిగా జడ్జి తీర్పు ఇచ్చారు.

వేటగాడు అరెస్టు

చిట్వేలి : చిట్వేలి–పుల్లంపేట రహదారిలో (అంబుల విరయ్య కనం) జంతువులను వేటాడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు రేంజర్ ధీరజ్ శుక్రవారం తెలియజేశారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ గురువారం రాత్రి సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బీట్ ఆఫీసర్లతో కలిసి గస్తీ నిర్వహించారన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం, ధర్మచెట్ల వారిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన భల్లోల చంద్రమోహన్ (25), రైల్వేకోడూరుకు చెందిన పాతగిరి గంగాధర్లు నాటు తుపాకీతో అడవి జంతువుల వేటకు వచ్చారన్నారు. ఎస్ఎఫ్ఓ శ్రీనివాసులు, బీట్ ఆఫీసర్లు వారిని చుట్టుముట్టి చంద్రమోహన్ను తుపాకీతో సహా పట్టుకోగా గంగాధర్ పారిపోయాడని తెలిపారు. పారిపోయిన వ్యక్తి కోసం గాలిస్తున్నామని, ఈ మేరకు కేసు నమోదు చేసి చంద్రమోహన్ను రిమాండ్కు తరలించినట్లు రేంజర్ ధీరజ్ తెలిపారు.

శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

– వివాదాస్పద భూమిని పరిశీలించిన సబ్కలెక్టర్


ఎర్రనీళ్లపల్లిలో వివాదాస్పద భూమిని పరిశీలించి బాధితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

రామసముద్రం : గ్రామాల్లో శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ అన్నారు. శుక్రవారం మండలం ఎర్రనీళ్లపల్లెలో గత కొంతకాలంగా వివాదాస్పదంగా ఉన్న భూమిని సబ్ కలెక్టర్ పరిశీలించారు. వివరాలిలా.. సర్వే నంబర్ 218/1సి లోని 2.75సెంట్ల ప్రభుత్వ భూమికి సంబంధించి గత ఆరునెలలుగా లక్ష్మమ్మ,పార్వతమ్మల మధ్య వివాదం నెలకొంది. ఇందుకు సంబంధించి లక్ష్మమ్మ జిల్లా కలెక్టర్కు వినతి చేసుకుంది. ఇందులో భాగంగా మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ వివాదాస్పద భూమిని పరిశీలించి బాధితులను విచారించారు. రామసముద్రం తహసీల్దార్ నిర్మలాదేవి, డివిజనల్ సర్వేయర్ దిలీప్ కుమార్ సమక్షంలో భూమి సర్వే చేసి బాధిత మహిళ లక్ష్మమ్మకు భూమిని స్వాధీనం చేశారు. అయితే మరోవర్గానికి చెందిన పార్వతమ్మ ఇందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ సబ్ కలెక్టర్ ముందు గోడు వెళ్లబోసుకుంది. గత కొన్ని ఏళ్లుగా భూమిని అనుభవిస్తున్న తమకు భూమి లేకపోతే ఎలా బతకాలని సబ్ కలెక్టర్కు మొర పెట్టుకున్నారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ ఈ భూమికి బదులుగా వేరొకచోట భూ పట్టా ఇప్పిస్తామని, ఎలాంటి గొడవలు చేసుకోకుండా ఉండాలని చెప్పారు. అనంతరం మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీలో జరుగుతున్న భూ రీసర్వేను సబ్ కలెక్టర్ పరిశీలించారు. భూ వివాదాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అరికెల పంచాయతీ చిట్టెం వారి పల్లెలో గత కొంతకాలంగా ఉన్న దారి కోసం గ్రామస్తుల మధ్య నెలకొన్న వివాదాస్పద భూమిని సబ్ కలెక్టర్ సందర్శించారు. ఇరువర్గాలతో చర్చించారు. ఇరువర్గాల వారికి న్యాయం చేసేలా సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తామని వారికి సూచించారు. కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఆర్ఎం కార్యాలయంలో గోపాల్రెడ్డి డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహించారు.

- గాలివీడుకు చెందిన వెంకట రమణ కదిరి నుంచి తిరుపతికి వయా ఎన్పీ కుంట, గాలివీడు, రాయచోటి మీదుగా బస్సును నడపాలని కోరారు.
- మాధవరానికి చెందిన మునెయ్య కొత్త మాధవరం, మాధవరం–1లో ఎక్స్ప్రెస్ బస్సులకు రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలన్నారు.
- అగుడూరుకు చెందిన రమణ, రాజాలు ప్రొద్దుటూరు–సంతకొవ్వూరు మధ్య తిరుగుతున్న సర్వీసును అగడూరు వరకు పొడిగించాలన్నారు.
- బుక్కాయపల్లె రామమునిరెడ్డి దువ్వూరు మండలం బుక్కాయపల్లె గ్రామానికి ప్రొద్దుటూరు లేదా మైదుకూరు డిపో నుంచి బస్సు నడపాలన్నారు.
- జమ్మలమడుగుకు చెందిన సాయిచంద్రారెడ్డి ప్రొద్దుటూరు–జమ్మలమడుగు నాన్స్టాప్ బస్సులకు బుకింగ్ కండక్టర్లు త్వరితగతిన టిక్కెట్లు జారీ చేసేలా చూడాలని కోరారు. ఆయా సమస్యలను ఆర్ఎం సంబంధిత డిపో మేనేజర్లకు బదిలీ చేసి వాటి పరిష్కరించాలని చొరవ చూపాలని సూచించారు.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలి


చేతికి నల్లరిబ్బన్లు కట్టుకుని మసీదుల వద్ద నిరసన తెలుపుతున్న ముస్లింలు



రైల్వేకోడూరులో నిరసన తెలుపుతున్న ముస్లింలు

రాయచోటి అర్బన్ : మైనార్టీలకు తీరని అన్యాయాన్ని కలిగించే వక్ఫ్ సవరణ బిల్లును రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం పార్లమెంటులో వ్యతిరేకించాలని పలువురు ముస్లిం, మైనార్టీలు డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు ను అమలులోకి తేవడాన్ని నిరసిస్తూ పట్టణంలోని ముస్లిం, మైనార్టీలు జమియత్ – ఉలేమా– ఏహింద్, సహారా సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో మసీదుల వద్ద నమాజ్ సమయంలో చేతికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సహారా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు అమీర్ అలీ, ఆఫ్తాబ్లు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంటు ఆమోదం కోసం తీసుకువస్తున్న వక్ఫ్ సవరణ బిల్లు దేశంలో ప్రజా స్వామిక సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఉందన్నారు. తమ పూర్వీకులు అల్లా పేరు మీద దానం చేసిన మసీదులు, దర్గాల భూములను కేంద్ర ప్రభుత్వం వక్ఫ్బిల్లు సవరణ పేరుతో కాజేయాలని చూస్తుండడం దారుణమన్నారు. కార్యక్రమంలో జమియత్ ఉలేమా ఏ హింద్ సంస్థ సభ్యులు షబ్బీర్, జాబీర్, అర్షద్, వవాజ్, ఫయాజ్తో పాటు పలువురు ముస్లిం, మైనార్టీలు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలి

రైల్వేకోడూరు అర్బన్ : కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలని ముస్లిం నాయకులు, ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక జామియా మసీద్ వద్ద కేంద్ర ప్రభుత్వ తీరుపై ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా పిలుపు మేరకు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీలు ముస్లింల హక్కులను కాలరాసే విధంగా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ముందుకు తెచ్చారని తెలిపారు. ఎవరి ఆనందం కోసం ఇలా చేశారో చెప్పాలని పేర్కొన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ఇవ్వడం సరికాదని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏమీ మాట్లాడకుండా మద్దతు ఇవ్వడం చూస్తుంటే వారు ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా ఉన్నారని తెలుస్తోందన్నారు. వెంటనే బిల్లును వెనక్కి తీసుకొనే విధంగా రాష్ట్ర ఎంపీలు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ జెడ్పీటీసీ వైఎస్ అన్వర్ బాషా, ముజీబ్, పఠాన్మైశా, కరీముల్లా, షబ్బీర్, సాదక్వల్లీ, ఇర్ఫాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఫారం పాండ్ పనుల పరిశీలన

సిద్దవటం : మండలంలోని శాఖరాజుపల్లె, ఉప్పరపల్లె, బొగ్గిడివారిపల్లె గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఫారం పాండ్ పనులను శుక్రవారం డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదిశేషారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పనుల వలన రైతులకు నీటి నిల్వలను పెంచే అవకాశం ఉందన్నారు. భూమిలో నీటి నిల్వలు పెరిగి భూసారం పెరుగుతుందన్నారు. కొంత మంది ఉపాధి కూలీలు తమకు వేతనాలు అందలేదని, కూలి శాతం కూడా తక్కువగా వస్తోందని, కూలి రేట్లను పెంచాలని ప్రాజెక్టు డైరెక్టర్కు వివరించారు. ఈ విషయంపై స్పందించిన ఆయన కూలీల వేతనాలు వెంటనే వచ్చే విధంగా చూస్తామని, కూలి డబ్బులను పెంచే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. శేఖరాజుపల్లె గ్రామంలో గోకులాల షెడ్లను, చాముండేశ్వరి పేట గ్రామంలోని ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేసిన ఉద్యాన పంటలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ నరసింహులు, రైతులు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ శిరీష, టెక్నికల్ అసిస్టెంటు ఓబుల్రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


ఉప్పరపల్లెలో పనులను పరిశీలిస్తున్న డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదిశేషారెడ్డి